
సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



కోర్కెలు తీర్చే వీరభద్రుడు

రాష్ట్రంలో అతి పురాతన, మహిమ కలిగిన ఆలయంగా 400ఏళ్ల నాటి చరిత్ర ఈ వీరభద్రేశ్వర స్వామి ఆలయ సొంతం. 8లో▸



రిజర్వేషన్ల సాధనకు పోరాటం

నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి అన్నారు. 8లో▸

ఊర్మిళ చౌహాన్ సందడి

హిమాయత్‌నగర్: 'ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ–2023' ఊర్మిళ చౌహాన్ సిటీలో సందడి చేసింది. హిమాయత్‌నగర్‌లోని ఐఎన్‌ఐఎఫ్‌డీ ఇనిస్టిట్యూట్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులతో సోమవారం ఆమె ఇంటరాక్ట్ అయ్యారు. ఫ్యాషన్ రంగంలో కొత్త ట్రెండ్స్‌ను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. తాను మిస్ ఇండియా ప్రధాన పోటీలకు సన్నద్ధం అవుతున్నట్లు తెలిపారు. త్వరలో ఆ కిరీటాన్ని సాధిస్తానంటూ ధీమా వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించండి సారూ..



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు సత్వరమే పరిష్కార మార్గం చూపించాలని అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. మొత్తంగా 85 ఫిర్యాదులు అందగా, వీటిని సత్వరమే పరిష్కరించేలా చూడాలని అడిషనల్ కలెక్టర్ సంబంధిత అధికారులు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

6న జెడ్పీ సమావేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మార్చి 6న ఉదయం 11 గంటలకు ఖైరతాబాద్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్ తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి జిల్లా ప్రజాప్రతినిధులంతా హాజరు కానున్నట్లు చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులంతా సమగ్ర సమాచారంతో విధిగా సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



ప్రదీప్ మృతదేహం

మీర్‌పేట: డిగ్రీ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మహేందర్ రెడ్డి కథనం ప్రకారం.. నాదర్‌గుల్ రాజ్యలక్ష్మీనగర్ కాలనీకి చెందిన తాండ్రవాసు యాదయ్య కుమారుడు ప్రదీప్ (19) ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం తల్లిదండ్రులు పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాత్రి 10.30 గంటలకు తిరిగి వచ్చేసరికి ప్రదీప్ ఎడమచేతి మణికట్టు వద్ద బ్లేడుతో కోసుకుని హాలులోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మానసిక ఒత్తిడి భరించలేకే ప్రదీప్ ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో తేలిందని, తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

వార్డు రిజర్వేషన్ల ఖరారు

గెజిట్ విడుదల చేసిన కేంద్రం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఎన్నికలకు సంబంధించి వార్డుల రిజర్వేషన్లను కేంద్రం ఖరారు చేసింది. దేశ వ్యాప్తంగా ఎన్నికలు నిర్వహిస్తున్న 57 కంటోన్మెంట్‌లలో మహిళ, ఎస్సీ రిజర్వుడ్ వార్డులను ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో వివిధ కంటోన్మెంట్‌ల నుంచి వచ్చిన ప్రతిపాదనలకు అనుగుణంగా తాజా గెజిట్ విడుదల చేసినట్లు స్పష్టం చేసింది. తాజా ఉత్తర్వులు ఐదేళ్ల పాటు వర్తిసాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఎనిమిదో వార్డులో ఎస్సీల జనాభా అధికంగా ఉండటంతో 2008లోనే ఆ వార్డును ఎస్సీలకు రిజర్వు చేశారు. 2015తో పాటు తాజా ఎన్నికల్లోనూ ఆ రిజర్వేషన్నే యథాతథంగా కొనసాగిస్తున్నారు. రొటేషన్ పద్ధతిలో కొనసాగుతున్న మహిళా రిజర్వేషన్లకు సంబంధించి మూడేళ్ల క్రితమే డ్రా ద్వారా రిజర్వుడు వార్డులను గుర్తించారు. 2, 5, 6 వార్డులు మహిళలకు కేటాయించారు.

ఇబ్బందులు తొలగించండి

జీహెచ్‌ఎంసీ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం వినతి

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో ఆస్తిపన్ను ఆదాయం పెరగడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని, జీహెచ్‌ఎంసీ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమసంఘం ప్రతినిధులు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీంతోపాటు తమకు ఎన్నికల విధులు అప్పగించేటప్పుడు పనిని పూర్తిచేసేందుకు తగిన సమయాన్నివ్వాలని కోరారు. అలా కాకుండా త్వరితంగా చేయాలని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో మౌఖిక ఆదేశాలు జారీ చేస్తుండటం, ఎస్‌ఎంఎస్‌ల వల్ల వేటిని పాటించాలో, వేటిని పాటించవద్దో తెలియని అయోమయం నెలకొంటోందని ప్రస్తావించారు. జీతాలు ఒకటో తేదీన కాకుండా 5–10 తేదీల మధ్య చెల్లిస్తుండటంతో ఈఎంఐల చెల్లింపులు, తదితరమైన వాటిల్లో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటూ, రెవెన్యూ విభాగంలో పని చేసే టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్ల ఇబ్బందులు తొలగించాలని కోరారు.

డిస్కంలో వసూళ్ల దందా!

- విద్యుత్ ప్యానల్ బోర్డుల కోసం వేలల్లో దరఖాస్తులు
- సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లలో నెలల తరబడి అపరిష్కృతం
- ముడుపులిస్తేనే ఫైలు ముందుకు
- విసిగి వేసారుతున్న వినియోగదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని ఎంపీపటేల్‌గూడకు చెందిన ఓ వినియోగదారుడి ఇంటి కరెంట్ మీటర్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. పాత మీటర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాల్సిందిగా డిస్కంకు దరఖాస్తు చేసుకున్నాడు. గడువు ముగిసినా మీటర్ మార్చకపోవడంతో తన కున్న పరిచయాలతో డిస్కం కార్పొరేట్ ఆఫీసు నుంచి సంబంధిత సెక్షన్ అధికారికి చెప్పించాడు. అయినా పనికాలేదు. మీటర్ మార్చిడికి లైన్‌మన్ రూ.4000 డిమాండ్ చేశాడు. చేసేది లేక అతను అడిగినంత ఇచ్చి పని చేయించుకోవాల్సి వచ్చింది. ఇలా ఇబ్రహీంపట్నం డివిజన్‌లోనే కాదు ఓఆర్‌ఆర్‌కు అటు ఇటుగా ఉన్న ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి విద్యుత్ ఇంజనీర్ల అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది.



సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్ ప్యానల్ బోర్డు కనెక్షన్లు జిల్లాలో వేలల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ముడుపులిస్తే తప్ప ముందుకు సాగడం లేదు. దరఖాస్తుదారుడు స్వయంగా ఆఫీసుకు వచ్చి అధికారులను కలిసి చేయి తడిపిన తర్వాతే ఫైలు ముందుకు కదులుతోంది. రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు లాగుతున్నారు. ఈ అక్రమ వసూళ్ల దందాపై ఫిర్యాదులు అందుతున్నా డిస్కం యాజమాన్యం పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో మెజార్టీ ప్రాంతాలు నగరానికి ఆనుకుని ఉన్నాయి. కొత్తగా వెలిసే గృహ, వాణిజ్య సముదాయం ఏదైనా నాలుగు విద్యుత్ కనెక్షన్లకు మించితే భద్రత దృష్ట్యా విధిగా ప్యానల్ బోర్డు ఏర్పాటు చేసుకోవాలి. ఈ నిబంధనే అక్రమార్కులకు పంట పండిస్తోంది.

దరఖాస్తుతో మొదలు..

కనెక్షన్ కోసం వినియోగదారుల సేవా కేంద్రంలో మొదట దరఖాస్తు చేసుకోవాలి. ఇక్కడే కొందరు దళారులు తిష్ట వేస్తున్నారు. వీరు కేవలం ప్యానల్ బోర్డు కనెక్షన్లు మాత్రమే చేపడతారు. సాధారణంగా దళారులు బయటివారుంటే.. డిస్కంలో సిబ్బందే దళారుల అవతారం ఎత్తుతారు. వీరు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. వినియోగదారుల సేవా కేంద్రం నుంచి దరఖాస్తు సంబంధిత సెక్షన్ ఏఈకి వెళ్తుంది. వీరు అంచనాలు రూపొందిస్తారు. ఈ పనిచేయాలంటే చాలా సెక్షన్లలో రూ.10 వేల దాకా ఇవ్వాల్సిందే. అంచనా వేసే సబ్ ఇంజినీర్‌కు రూ.2 వేలు ముట్టజెప్పాలి. అక్కడి నుంచి ఏడీఈకి వెళ్తుంది. ఆయన ఓ లేఖ ఇస్తారు. ఇక్కడ మరో రూ.పదివేలు సమర్పించుకోవాలి. ఇక్కడ ఉండే సబ్‌ఇంజనీర్‌కు రూ.2వేలు, ఆపరేటర్‌కు రూ.వెయ్యి.. అలాఅలా డీఈ వద్దకు ఫైలు వెళ్తుంది. ఆయన అనుమతికి మరో రూ.పది వేలు ఇచ్చుకోవాలి.

అనుమతి నుంచి సరఫరా వరకు

అనుమతి సమాచారం వినియోగదారుకు చేరగానే.. వినియోగదారుల సేవా కేంద్రంలో సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. సొమ్ము చెల్లించగానే ఏఈ వర్క్ ఆర్డర్ రాసిస్తారు. ఏడీఈ కౌంటర్ సిగ్నేచర్ చేస్తారు. ఎస్‌ఈ వర్క్ ఆర్డర్ ఇస్తారు. ఇక్కడ కూడా ముడుపులు ఇవ్వాల్సిందే. ఆర్డర్ తీసుకుని స్టోర్‌కు వెళ్తే సామగ్రి ఇస్తారు. ఇండోర్ స్టోర్ నుంచి మీటర్లు ఇస్తారు. ఒక్కో మీటర్‌కు రూ.500 ఇవ్వాలి. అవుట్‌డోర్ స్టోర్ నుంచి తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ వంటి సామగ్రి అందజేస్తారు. వీరికి సామగ్రి విలువను బట్టి రూ.2వేల నుంచి రూ.3 వేల వరకు ఇవ్వాలి. అంచనాలో పేర్కొన్న పనులన్నీ కాంట్రాక్టర్ పూర్తి చేశాక ఏఈ, ఏడీఈ తనిఖీ చేస్తారు. తనిఖీకి రావాలంటే మరో రూ.పదివేలు సమర్పించుకోవాలి. వీరు తనిఖీల అనంతరం నివేదిక డీఈకి ఇస్తే.. పని పూర్తయినట్లు నివేదిక ఇవ్వడానికి ఇంకో రూ.పదివేలు ఇచ్చుకోవాలి. సరఫరా ఇవ్వాలనే ఆదేశాలు అక్కడి నుంచి ఏడీఈకి, ఏఈకి వస్తాయి. ఇక్కడా రూ.పది వేలు ముట్టజెప్పాల్సిందే. అక్కడి నుంచి లైన్‌ఇన్‌స్పెక్టర్‌కు రూ.ఐదు వేలు ఇవ్వనిదే సరఫరా ఇవ్వడు. లైన్‌మన్లు, ఇతర సిబ్బందికీ ఎంతో కొంత ఇవ్వాల్సిందే.

111 జీఓ పరిధిలోనే అక్రమాలు అధికం

పదిహేను మీటర్ల ఎత్తుదాటిన భవనాలకు స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీల నుంచి అక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంది. లేకున్నా రూ.లక్షల్లో దండుకుని కనెక్షన్ ఇస్తున్నారు. జంటజలాశయాల పరిధిలో (111 జీఓ) ఉన్న రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గాల పరిధిలోని శంకర్‌పల్లి, మొయినాబాద్, ఇబ్రహీంబాగ్, శంషాబాద్, కొత్తూరులో ఈ దందా ఎక్కువగా జరుగుతోంది. దరఖాస్తుదారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి వదిలేస్తే ఎన్నిరోజులైనా కనెక్షన్ రాదు. స్వయంగా ఆఫీసుకు వచ్చి సంబంధిత ఇంజనీరును కలిసి..వారికి ఇవ్వాల్సింది ఇస్తే చకచకా పనవుతుంది. సరూర్‌నగర్, సైబర్‌సిటీ, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలో ఇటీవల వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే ఒక్కటంటే ఒక్కదానికి కూడా గడువులోగా కనెక్షన్ మంజూరు చేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

భూములు మా పేరున చేయాలి

- కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన

ఇబ్రహీంపట్నం రూరల్: ధరణి పోర్టల్ నిలువునా ముంచిందని, అధికారుల చుట్టూ తిరగలేక అగమై పోతున్నామని అన్నదాతలు ఆందోళనకు దిగారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం ఆపేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి పలువురు రైతులు తరలివచ్చారు. మా భూములు మా పేరున చేయడానికి రెండేళ్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని వాపోయారు. భూమి తక్కువగా వస్తుందని మీసేవలో దరఖాస్తు చేసుకుంటే మిస్సింగ్ సర్వే నంబర్ అని వస్తోందని, టీఎం 33లో ఆప్షన్ల ద్వారా దరఖాస్తు చేస్తే నోటీసు జనరేట్ కావడానికి నాలుగు నుంచి ఐదు నెలల సమయం పడుతోందన్నారు. దరఖాస్తులకే వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని మండిపడ్డారు. రెండు మూడు సార్లు దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. సొంత భూములున్నా రికార్డులు సరిగా ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యానికి తాము ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ ఇందిరాల రమేష్, రైతులు నిమ్మగడ్డ సుబ్రహ్మణ్యం, మల్లారెడ్డి, చంద్రకళ, ప్రభులింగం, నర్సింహ, నాగరాజుగౌడ్, నరేందర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల నుంచి కాపాడండి

షాద్‌నగర్‌టౌన్: పట్టణంలోని 20వ వార్డులో కుక్కల బెడద అధికమైందని, కుక్కల నుంచి ప్రజలను కాపాడాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం మున్సిపల్ మేనేజర్ నయూంషాకు వినతి పత్రం అందజేశారు. వీధి కుక్కలతో కాలనీలో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. చిన్నారులు ఇళ్ల నుంచి బయటికి రావాలంటేనే భయపడుతున్నారని పేర్కొన్నారు. వీధి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో డాకన్నగారి మనీష్ తదితరులు ఉన్నారు.



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

సమస్యలపై రాజీలేని పోరాటం



రెడ్డిపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

మొయినాబాద్: ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్‌టీయూ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు, చందానగర్, మేడిపల్లి, రెడ్డిపల్లి తదితర ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి పీఆర్‌టీయూ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతిని తీసుకొచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఉపాధ్యాయుల ఇతర సమస్యలు పరిష్కరించేందుకు పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, మొయినాబాద్ మండల అధ్యక్షుడు బందయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణ, గౌరవ అధ్యక్షుడు రాములు, నాయకులు ప్రతాప్, నరేందర్, వేణుగోపాల్, మాణిక్యం, రాములు, లక్ష్మణ్, భీమ్లా, రవికుమార్, వెంకటయ్య, శ్రీనివాస్, జంగయ్య, తదితరులు ఉన్నారు.

అర్హులకు న్యాయం చేయండి

- ఫార్మాసిటీ పరిహారం చెల్లింపులో అక్రమాలపై నిగ్గు తేల్చండి
- కలెక్టరేట్ ఎదుట తాడిపర్తి గ్రామ రైతుల ఆందోళన

యాచారం: తాడిపర్తి సర్వే నంబర్ 104లోని 250 ఎకరాల భూదాన్ భూమిలో భారీ అక్రమాలు జరిగాయని, భూదాన్ భూమిని క్రయవిక్రయాలు జరపరాదనే నిబంధన ఉన్నా ఫార్మాసిటీకి సేకరించి కుంభకోణానికి పాల్పడ్డారని ఆ గ్రామ రైతులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ తిరుపతి రావుకు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో కొద్దిసేపు ప్రధాన గేట్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. భూదాన్ భూమికి పరిహారం ఇవ్వరాదని, అనర్హులకు పరిహారం ఇస్తున్నారని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని రైతులు అన్నారు. ఆ భూమిలో సాగు చేసి కేసుల పాలై జైలుకు కూడా వెళ్లొచ్చామన్నారు. అధికారులు మాత్రం భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. అనర్హులకు పరిహారం అందజేసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కొంతమంది మధ్యవర్తులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై రూ. కోట్లాది అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. వెంటనే నిగ్గు తేల్చి, అర్హులైన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వర్షాలు కురిసిన వెంటనే జూన్‌లో ఆ భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందుతామని స్పష్టం చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

బరి తెగించి కుంభకోణాలు

ఫార్మాసిటీ భూసేకరణలో కొంత మంది అధికారులు బరి తెగించి రూ.కోట్ల కుంభకోణాలకు పాల్పడ్డారని, విచారణ చేసి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఫార్మాసిటీ కేసీఆర్ సర్కార్‌కు ఓ పెద్ద వ్యాపార సంస్థగా మారిందని, రైతులకు న్యాయం చేయకుండా రియల్ వ్యాపారం చేస్తోందని మండిపడ్డారు. రైతులకు న్యాయం చేయడం కోసం కోర్టులను ఆశ్రయిస్తామని అన్నారు. తాడిపర్తిలోని 250 ఎకరాల భూదాన్ భూమిలో వందలాది మంది రైతులు ఏళ్లుగా సాగు చేసుకుని జీవనోపాధి పొందడమే కాక, గొర్రెలు, మేకలు, పశువులను మేపి జీవనోపాధి పొందారన్నారు. ఆ రైతులకు కాకుండా ఫార్మాసిటీకి సేకరించి అక్రమంగా పరిహారం అందజేసి, జేబులు నింపుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు పల్లె వినయ్‌కుమార్, తాడిపర్తి సర్పంచ్ దూస రమేష్, నాయకులు సామ నిరంజన్, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

పూడ్చేసి.. కాజేయాలని చూసి!

- తుర్కయంజాల్ ఎర్రకుంటపై కబ్జాదారుల కన్ను
- రెండు వైపుల నుంచి మట్టిని డంప్ చేస్తున్న వైనం
- మొదటి నుంచీ ఆక్రమణకు ప్రయత్నాలు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

తుర్కయంజాల్: 'కాదేదీ కబ్జాలకనర్హం' అన్న చందంగా అక్రమార్కులు ఏదీ వదలడం లేదు. చెరువులు, కుంటలపై సైతం కన్నేశారు. యథేచ్ఛగా మట్టితో డంప్ చేస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధి మన్నెగూడలోని సర్వే నంబర్ 45లోని 2.25 ఎకరాల శిఖం భూమి, సర్వే నంబర్ 44, 43లోని పట్టా భూముల్లో చెరువు విస్తరించి ఉంది. ఇరిగేషన్ శాఖ నిబంధనల ప్రకారం చెరువులు, కుంటలు, కాలువల పరిధిలో పట్టా భూములున్నప్పటికీ వాటిని పూడ్చి వేయడం,ధ్వంసం చేయాలని ప్రయత్నించడం చట్టరీత్యా నేరం.

గతంలో ఫేక్ ఎన్‌ఓసీ సృష్టించినా..

2016 ఏప్రిల్‌లో సర్వే నంబర్ 43లోని 2.1 ఎకరాల భూమికి ఎన్‌ఓసీని తెచ్చి పూడ్చి వేయడానికి ప్రయత్నిస్తుండగా 'సాక్షి'లో కథనం రావడంతో అధికారులు, పూడ్చడానికి ప్రయత్నిస్తున్న వారు వెనక్కి తగ్గారు. ఆ తరువాత అధికారులు మట్టిని తొలగించి , ఎన్‌ఓసీ ఫేక్ అంటూ ప్రకటన ఇచ్చారు. కొన్నేళ్ల పాటు స్తబ్దుగా ఉన్న భూ యజమానులు ఇటీవల మళ్లీ చెరువును పూడ్చే ప్రయత్నాలు మొదలు పెట్టారు.

భూముల ధరలు కోట్లలో ఉండటంతో..

ఎర్రకుంట సాగర్ రహదారికి కూత వేటు దూరంలో ఉండటం, చుట్టూ భారీ అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు, ఫంక్షన్ హాళ్లు ఉండటంతో ఎకరం భూమి ధర రూ. 20 కోట్ల వరకు పలుకుతోంది. ఇంత భారీ ధర లభించే భూమిలో కుంట ఉండటం ఇష్టం లేని కొందరు మొదటి నుంచీ చెరువును మింగేయాలని చేయని ప్రయత్నం లేదు. 2020లో భారీ వరద వస్తే తూము నుంచి నీరు పోతున్నా.. తూమును ధ్వంసం చేయడం అప్పట్లో వివాదానికి దారితీసింది. తూమును ధ్వంసం చేయడంతో నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండటం లేదు. నీరంతా బయటకు వెళ్లిపోతోంది. అయినా ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. తాజాగా రెండు వైపుల నుంచి మట్టిని డంప్ చేసి చెరువును మాయం చేయాలని చూస్తున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించి కబ్జాదారుల చెర నుంచి ఎర్రకుంటను కాపాడాలని కోరుతున్నారు.



చెరువులో మట్టి డంప్



తూము వైపు నుంచి డంప్

మా దృష్టికి రాలేదు..

ఎర్రకుంటలో మట్టి డంప్ చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే సిబ్బందిని పంపించి పరిశీలిస్తాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో మట్టిని డంప్ చేసినట్లు తేలితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– ఉషారాణి, డీఈఈ, ఇరిగేషన్ శాఖ

వరద పోటెత్తితే..

2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు పై నుంచి పెద్ద ఎత్తున వరద పోటెత్తడంతో చెరువుకు ఆనుకుని ఉన్న అరుంధతీ కాలనీలోని ఇళ్లు నీట మునిగిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఏటా కురుస్తున్న వర్షాలకు చెరువు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటోంది. వర్షాలు కురిసినప్పుడు పై నుంచి వచ్చే వరద అంతా ఈ చెరువులోకే చేరుతోంది. ఇలా చెరువును పూడ్చి వేసి అన్యాక్రాంతం చేస్తే భవిష్యత్తులో చిన్నపాటి వర్షం కురిసినా ఇళ్లన్నీ జలమయం కాక తప్పదు. ఇప్పటికే చెరువులోకి నీరు రాకుండా వెంచర్లు, నిర్మాణాలు వెలవడంతో నీరు ఎక్కడిక్కడే నిలిచిపోతుంది.

అన్నా చెల్లెలిపై కుక్క దాడి

రహమత్‌నగర్ : నగరంలో చిన్నారులపై కుక్కల దాడులు ఆగడం లేదు. తాజాగా బోరబండ మధురానగర్‌లో సోమవారం మధ్యాహ్నం ఆరుబయట ఆడుకుంటున్న ఫైజన్(8) అతని చెల్లెలు ఫిర్దోస్(6)లపై పక్కింటి పెంపుడు కుక్క దాడి చేసింది. ఈ ఘటనలో చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులకు మోతీనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

కోర్కెలు తీర్చే వీరభద్రుడు

- సంతాన ఫలం.. ఆరోగ్య ప్రదాతగా భక్తుల విశ్వాసం
- నేటి నుంచి స్వామి వారి కల్యాణోత్సవాలు


వీరభద్రస్వామి దేవాలయం


కొలువుదీరిన వీరభద్రుడు

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలో అతి పురాతన, మహిమ కలిగిన ఆలయంగా 400ఏళ్ల నాటి చరిత్ర ఈ వీరభద్రేశ్వర స్వామి ఆలయ సొంతం. విశ్వాసంతో ప్రార్థిస్తే కోరికలు తక్షణమే నెరవేరుతాయని భక్తుల నమ్మిక. మండల కాలం పాటు తడి దుస్తులతో(మడి) ప్రదక్షిణలు చేస్తే అవివాహితులకు వివాహం.. సంతానం లేని వారికి సంతాన భాగ్యం.. అనారోగ్యంతో బాధపడే వారికి ఆరోగ్యం ప్రసాదిస్తాడని.. తనను వేడుకున్న వారిని భద్రంగా కాపాడుతాడని భక్తుల విశ్వాసం. రాష్ట్రంలోని కురివి వీరభద్ర స్వామి ఆలయం తర్వాత అంతటి ప్రత్యేకత ఈ ఆలయానిది. స్వామివారికి నిత్యం అభిషేకం చేసేందుకు గుడి ఆవరణలోనే ఉన్న పురాతన బావి ఇప్పటికీ చెక్కు చెదరలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు బస చేసేందుకు ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీ ప్రత్యేక ఆకర్షణ.

వంద ఎడ్లబండ్లపై తీసుకెళ్తుండగా

400ఏళ్ల క్రితం కాశీ నుంచి వీరభద్రస్వామి రాతి విగ్రహాన్ని కొంతమంది మంచిర్యాలకు 100ఎడ్ల బండ్ల మీద తీసుకువెళ్తుండగా మార్గమధ్యలోని బలిజగూడలోని వేపచెట్టు కింద(ప్రస్తుతం గుడి ఉన్న ప్రదేశం) సేద తీరి రాత్రి బసచేశారని, తిరిగి ఉదయం మంచిర్యాలకు వెళ్లేందుకు వారు సన్నద్ధమవుతుండగా స్వామి వారు ఉన్న ఎండ్ల బండి భూమిలోకి కుంగిపోవడంతో.. అందులోంచి ఓ వ్యక్తికి పూనకం వచ్చి 'నన్ను ఇక్కడి నుంచే తీసుకువెళ్లవద్దని, ఇక్కడే ప్రతిష్ఠించాలని' కోరడంతో స్వామి ఇక్కడ ప్రతిష్ఠించినట్లు చరిత్ర. దీంతో అప్పటి నుంచి స్వామి వారిని నిత్యం ధూపదీప నైవేద్యాలతో భక్తులు కొలుస్తూ వస్తున్నారని, ఈ ఆలయానికి భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఆలయ ప్రధానార్చకుడు భూషన్ తెలిపారు.

మూడు రోజుల పాటు కల్యాణోత్సవాలు

వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు కల్యాణ రథోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మైలసేవతో ప్రారంభమయ్యే పూజా కార్యక్రమాలు బుధవారం ఉదయం అభిషేకం, సాయంత్రం స్వామి వారి కల్యాణం, గురువారం తెల్లవారుజామున అగ్నిగుండాలు, రథోత్సవం, స్వామి వారి ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రతి ఏటా కల్యాణోత్సవం రోజు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశాం. భక్తుల సౌకర్యార్థం ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేస్తాం. కల్యాణోత్సవాలకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పలువురు నేతలు హాజరుకానున్నారు.

– బుర్ర వీరస్వామిగౌడ్, సర్పంచ్, బలిజగూడ

దివ్యాంగుల రిజర్వేషన్ల సాధనకు పోరాటం

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి


సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న భుజంగరెడ్డి

షాద్‌నగర్: నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగ రెడ్డి అన్నారు. ఎన్‌పీఆర్‌డీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. నామినేటెడ్ పదవుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏళ్లు గడుస్తున్నా దివ్యాంగుల సంక్షేమానికి ఏ ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం దివ్యాంగులు ఐక్య ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మానసిక దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలని, రైల్వేలో మరిన్ని సౌకర్యాలు పెంచాలని, ప్రభుత్వం రంగంలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా దివ్యాంగుల పెన్షన్‌ను రూ.10వేలకు పెంచాలని కోరారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లోనూ దివ్యాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి రాజశేఖర్‌గౌడ్, వేముల కుసుమ, దర్శనం శంకర్, ఖాజా, శ్రావణ్, మహేశ్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మాకు రావాల్సిన భూ పరిహారం ఇవ్వకుండా మమ్మల్ని రోడ్డుపాలు చేసిన రెవెన్యూఅధికారులు, భూదాన్ బోర్డు మాజీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు బాధితుడు ఐలేష్ ఫిర్యాదు చేశాడు. ఇబ్రహీంపట్నం సర్వే నెంబరు 58లో ఐదెకరాల భూమికి పరిహారం ఇవ్వకుండా మమ్మల్ని తప్పుదోవపట్టించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పట్లో ఉన్న ఆర్డీఓ రాజేందర్, భూదాన్ బోర్డు చైర్మన్ రాజేందర్‌రెడ్డి, రాంరెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయం చేస్తామని అనేక మార్లు ప్రభుత్వ అధికారులు హామీలు ఇచ్చి పట్టించుకోవడం లేదని వాపోయారు. మాకు అనుకూలంగా రిపోర్టు పంపుతామని చెప్పి మోసం చేస్తున్నారని తెలిపారు. నావద్ద అన్ని పత్రాలు తీసుకుని దళారులకు కట్టబెట్టారని, అక్రమంగా కొంత మంది పట్టాలను తయారు చేసుకుని పరిహారం కొట్టేశారన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి పరిహారం ఇప్పించాలని కోరారు. లేదంటే మా కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యమని.. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నాడు.

కిడ్నాప్ కేసులో ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

రాజేంద్రనగర్: సోదరుడితో కలిసి ఓ యువకుడు మాజీ భార్యను కిడ్నాప్ చేసిన సంఘటన అత్తాపూర్ ఔట్‌పోస్ట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. 24 గంటల్లో పోలీసులు నిందితులను అరెస్టు చేసి యువతిని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు చెప్పిన ప్రకారం అత్తాపూర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ హసన్ మలక్‌పేట్ ప్రాంతానికి చెందిన యువతి ఆరు నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. రెండు నెలల క్రితం పెద్దల సమక్షంలో వారు విడాకులు తీసుకున్నారు. మహ్మద్ హసన్ ఆదివారం ఉదయం మాజీ భార్యకు ఫోన్ చేసి మాట్లాడుకునేందుకు అత్తాపూర్ రావాలని కోరాడు. దీంతో ఆమె అదే రోజు సాయంత్రం అత్తాపూర్‌లోని ఓ బేకరీ వద్దకు వచ్చింది. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన మహ్మద్ హసన్ తన సోదరుడు మహ్మద్ రియాజ్(24)తో కలిసి ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకుని మంచిర్యాల జిల్లాకు తీసుకెళ్లారు. రాత్రి కుమార్తె ఇంటికి రాకపోవడంతో బాధితురాలి తండ్రి మహ్మద్ ఇంతియాజ్ అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా సోమవారం ఉదయం మంచిర్యాల జిల్లా, మందమర్రి వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో యువతిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపిన ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీ పటేల్‌గూడకు చెందిన ఆదిమూలం రాజేందర్‌చారి(42) వడ్రంగి వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం రాత్రి అతడి సోదరుడి ఇంట్లో శుభకార్యం ఉండడంతో వారింటికి వెళ్లి వచ్చారు. భార్యాపిల్లలు అన్నత్రికి వెళ్లి వచ్చే వరకు రాత్రి పదిన్నర గంటల సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలోనూ రెండు సార్లు అత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బీఆర్‌ఎస్ నాయకులను నిలదీయండి

కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఈటల రాజేందర్

అబ్దుల్లాపూర్‌మెట్: వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చే బీఆర్‌ఎస్ నాయకులను ప్రజలు నిలదీయాలని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బండరావిరాల, చిన్న రావిరాల శక్తి కేంద్ర పరిధిలోని చిన్నరావిరాల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా గోస–బీజేపీ భరోసా పేరుతో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకోసం పనిచేయాల్సిన కేసీఆర్ సర్కారు పేదలను విస్మరిస్తూ ధనికుల శ్రేయస్సుకే పని చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధిలో కేంద్రం పాత్ర కీలకంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్త అశోక్‌గౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బతికుండగానే చంపేశారు

- రికార్డుల్లో చనిపోయినట్లు నమోదు..
- వితంతు పింఛను కోసం అధికారుల చుట్టూ చక్కర్లు
- కిరోసిన్ బాటిల్‌తో వచ్చి గ్రామసభలో గోడు వెళ్లబోసుకున్న బాధితురాలు

శంషాబాద్ రూరల్: ఓ మహిళను బతికుండగానే అధికారులు చంపేశారు.. రికార్డుల్లో చనిపోయినట్లు నమోదు కావడంతో ఆమెకు వితంతు పింఛన్ మంజూరు కావడంలేదు.. పింఛన్ కోసం ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరిగిన ఆమె చివరకు గ్రామసభలో తన గోడు వెళ్లపోసుకుంది.. తనకు న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని కిరోసిన్ డబ్బాను చూపిస్తూ గ్రామసభలో ఆందోళనకు దిగింది. మండల పరిధిలోని ముచ్చింతల్‌కు చెందిన బీర్ల మణెమ్మ(48) భర్త సత్తయ్య 2018లో మృతి చెందాడు. దీంతో ఆ మె వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకుంది. ఎన్నిసార్లు పంచాయతీ అధికారుల చుట్టూ తిరిగినా పలు రకాల కారణాలు చెబుతూ వచ్చారు. చివరకు ఆమె కూడా చనిపోయినట్లు రికార్డులో నమోదు అయినందున పింఛను రావడంలేదని చెప్పారు. దీంతో సోమవారం జరిగిన గ్రామ సభకు కిరోసిన్ బాటిల్‌తో వచ్చి ఆందోళన చేపట్టింది. తనకు ఎ లాంటి ఆధారం లేదని పింఛను మంజూరు చేయా లని వేడుకుంది. ప్రతి నెలా రేషన్ వస్తుందని, పింఛను మంజూరు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేసింది.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మణెమ్మ పేరుతో 2018 డిసెంబర్ వితంతు పింఛను మంజూరైంది. అప్పటి నుంచి వరుసగా మూడు నెలల పాటు ఆమె పింఛన్ డబ్బులు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో పింఛన్ నిలిచిపోయింది. నేను బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆమె పింఛన్ కోసం మళ్లీ దరఖాస్తు చేస్తే విషయం తెలిసింది. మణెమ్మ బతికి ఉన్నట్లు ఆమె పేరుతో పింఛను మంజూరు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తి చేశాం.

– రాజుకుమారి, జూనియర్ పంచాయతీ కార్యదర్శి, ముచ్చింతల్.

శ్రీధర్‌రావుపై రౌడీషీట్

గచ్చిబౌలి: సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. గచ్చిబౌలి, రాయదుర్గం తదితర స్టేషన్లలో ఆయనపై 30కి పైగా కేసులు నమోదయ్యాయి. గతంలో చీటింగ్, రేప్, దాడికి పాల్పడిన కేసులున్నాయి. గత డిసెంబర్‌లో సంధ్య కన్వెన్షన్‌లో కేఎంకే ఈవెంట్ సిబ్బందిపై శ్రీధర్‌రావు దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ ఉన్నతాధికారుల అనుమతితో ఆయనపై రౌడీషీట్ నమోదు చేశారు.

మంటలంటుకొని బాలిక మృతి

తలకొండపల్లి: ప్రమాదవశాత్తు సిలిండర్ మంటలంటుకొని తీవ్రంగా గాయపడిన ఓ బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కోండ మండలం ఊర్కోండపేట గ్రామానికి చెందిన వడ్డెమోని యాదమ్మ కూతురు ఐశ్వర్య (9) ఈ నెల 22న తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లికి చెందిన తన పెద్దనాన్న మల్లేశ్ ఇంటికి వెళ్లింది. అదేరోజు మల్లేశ్ కుటుంబ సభ్యులు పొలం పనుల నిమిత్తం వెళ్లగా.. ఐశ్వర్య మాత్రం ఇంట్లోనే ఉంది. ఉదయం 11 గంటల ప్రాంతంలో మ్యాగి వండుకుందామని ఐశ్వర్య సిలిండర్ వెలిగించింది. ప్రమాదవశాత్తు మంటలు ఐశ్వర్య దుస్తులకు అంటుకున్నాయి. మంటలు తాళలేక ఐశ్వర్య బయటికి పరుగులు తీసింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆరు రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఐశ్వర్య మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్‌యాదవ్ తెలిపారు.

స్మార్ట్‌కార్డ్ @ రూ.500

- డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీల స్మార్ట్‌కార్డులపై ఏజెంట్‌ల దందా
- స్పీడ్‌పోస్టు ద్వారా బట్వాడాలో తీవ్ర జాప్యం
- ఫీజులు, పోస్టల్ చార్జీలు చెల్లించినా.. కార్డు నేరుగా పొందాలంటే రూ.500 ఇవ్వాల్సిందే...

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏలో స్మార్ట్‌కార్డుల పై ఏజెంట్‌ల దందా యథేచ్ఛగా సాగుతోంది. స్మార్ట్ కార్డుల పంపిణీ కోసం ఫీజులతో పాటే స్పీడ్ పోస్ట్ చార్జీలు కూడా చెల్లించినప్పటికీ వాహనదారులకు సకాలంలో ఇంటికి చేరడం లేదు. పంపిణీలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటుంది. ఈ క్రమంలో స్మార్ట్‌కార్డుల కోసం రోజుల తరబడి పడిగాపులు కాసి చివరకు నేరుగా తీసుకునేందుకు వెళ్లే వినియోగదారుల నుంచి ఒక్కో కార్డుకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వరకు రూ.300 వరకు వసూలు చేసిన ఏజెంట్‌లు తాజాగా కార్డుల కొరత నెపంతో పెంచేశారు. ఇలా వచ్చే ఏజెంట్‌ల కోసం కొన్ని ప్రాంతీయ రవాణా కేంద్రాల్లో సిబ్బంది ప్రత్యేకంగా కౌంటర్‌లను సైతం ఏర్పాటు చేయడం గమనార్హం. విధులు ముగిసిన తర్వాత సాయంత్రం సమయంలో ఈ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఏజెంట్‌లకు, కొందరు సిబ్బందికి ఇది ఆదాయ వనరుగా మారింది. ఈ అక్రమ దందా పైన ఉన్నతాధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండటం గమనార్హం.

నీరుగారిన లక్ష్యం..

రవాణాశాఖలో పౌరసేవలను త్రీటైర్ సాంకేతిక వ్యవస్థతో అనుసంధానం చేసిన తరువాత డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీ పత్రాలను స్మార్ట్‌కార్డుల రూపంలో అందజేస్తున్నారు. మొదట్లో వాహనదారులకే వీటిని నేరుగా అందజేశారు. కానీ కొందరు తప్పుడు చిరునామాతో డ్రైవింగ్ లైసెన్సులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో చిరునామా ధృవీకరణ కోసం పోస్టల్ బట్వాడాకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం వాహన వినియోగదారుల నుంచి స్పీడ్ పోస్టు చార్జీల రూపంలో రూ.35 వసూలు చేస్తారు. పౌరసేవల కోసం చెల్లించే ఫీజులు, సర్వీస్ చార్జీలకు ఈ పోస్టల్ చార్జీలు అదనం. డ్రైవింగ్ లైసెన్సు కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకున్న 24 గంటల లోపు ఫీజులు, పోస్టల్ చార్జీలను కూడా ఆన్‌లైన్‌లో లేదా ఈ సేవా కేంద్రాల ద్వారా చెల్లించాలి. ఇలా అన్ని విధాలుగా ఫీజులు, చార్జీలు చెల్లించినప్పటికీ కొన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో సకాలంలో కార్డుల బట్వాడా జరగడం లేదు. మరోవైపు పోస్టల్ సిబ్బంది సైతం వినియోగదారుల ఇళ్ల వద్దకు వెళ్లకుండానే 'ఆ చిరునామాలో సదరు వ్యక్తి' లేడని వెనక్కి పంపేస్తున్నారు. దీంతో కేవలం వారం రోజుల వ్యవధిలో అందాల్సిన కార్డులు నెలలు గడిచినా ఇళ్లకు చేరడం లేదు. ఈ క్రమంలో వాహనదారులు ఆర్టీఏ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. 'చివరకు ఏజెంట్‌లను ఆశ్రయిస్తే తప్ప కార్డులు చేతికందడం లేదని' పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

కొరత కూడా కారణమే....

స్మార్ట్‌కార్డుల ముద్రణ కోసం అవసరమయ్యే స్టేషనరీని రవాణాశాఖ పలు ప్రైవేట్ సంస్థల నుంచి కొనుగోలు చేస్తుంది. కానీ సకాలంలో ఆయా సంస్థలకు డబ్బులు చెల్లించకపోవడంతో స్టేషనరీ దిగుమతిలో తీవ్ర సంక్షోభం నెలకొంటుంది. ముంబై నుంచి హైదరాబాద్‌కు స్మార్ట్‌కార్డుల మెటీరియల్‌ను పంపించే ఒక సంస్థకు రూ.కోట్లల్లో బకాయిపడడంతో గతేడాది కార్డుల దిగుమతిని నిలిపివేశారు. దీంతో నెలల తరబడి కార్డుల పంపిణీ స్తంభించింది. తరచుగా తలెత్తే ఇలాంటి సంక్షోభాల వల్ల కూడా వాహనదారులు ఏజెంట్‌లను ఆశ్రయించి అడిగినంతా చెల్లిస్తున్నారు. కార్డు చేతికొస్తే చాలునని భావిస్తున్నారు. ప్రతి పనికి ఒక రేటు చొప్పున విధించి వసూలు చేసే ఏజెంట్‌లు చివరకు స్మార్ట్ కార్డులను కూడా తమ అక్రమార్జనకు మార్గంగా ఎంచుకోవడం గమనార్హం.